జాతిపిత మార్గంలో పయనిద్దాం



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి ఫరూక్, చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్సీ తదితరులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : అహింసా మార్గంలో పోరాడి దేశానికి స్వాతంత్ర్యం అందించిన జాతిపిత మహాత్మా గాంధీని ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన మార్గంలో పయనించాలని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని నంద్యాల పట్టణంలోని గాంధీచౌక్‌లో ఆయన విగ్రహానికి కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి మంత్రి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గాంధీజీ స్ఫూర్తితో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడులు స్వచ్ఛ భారత్, స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాబున్నిసా, డీఆర్వో పద్మజ, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రీశైలం జలాశయం
నీటిమట్టం 881.20 అడుగులు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : శ్రీశైలం జలాశయం నీటిమట్టం బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి 881.20 అడుగులుగా నమోదైంది. నీటి నిల్వ 194.3096 టీఎంసీలుగా ఉంది. మరోవైపు ఎగువ పరివాహక ప్రాంతాలైన జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 45,181 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి వస్తోంది. శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రాల్లో అధికారులు విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ 45,559 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



శరన్నవరాత్రులకు సన్నద్ధం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో గురువారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఈనెల 12 వరకు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 8 గంటలకు భ్రమరాంబాదేవికి దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు దంపతులు, ఆలయ అర్చకులు, వేద పండితులు పసుపు, కుంకుమ, ఫలాలు సమర్పిస్తారు. అనంతరం ఆశీర్వచన మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, కంకణపూజ, కంకణ ధారణ, వాస్తుపూజ, వాస్తుహోమం తదితరాలు నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. రాత్రి 7 గంటలకు శ్రీభ్రమరాంబాదేవి అమ్మవారు శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. ఆలయ ప్రాంగణంలోని ప్రత్యేక వేదికపై కొలువైన ఉత్సవమూర్తికి, అలంకార మండపంలోని స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తారు. మంగళవాయిద్యాలు, కళాకారుల సందడి నడుమ పురవీధుల్లో గ్రామోత్సవం జరుగుతుంది.

పదవి లేకున్నా..
పైరవీల్లో మిన్న

■ బుగ్గనను నమ్ముకున్న వారికి కీలక స్థానాలు

■ ఇష్టానుసారంగా పోస్టింగులు ఇప్పించుకున్న వైనం ■ అధికార వర్గాల్లో విస్మయం



వైకాపా ప్రభుత్వంలో కీలకపాత్ర పోషించిన నాటి మంత్రి బుగ్గన ఇప్పుడు సైతం చక్రం తిప్పుతున్నారన్న ప్రచారం ఉంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ తనను నమ్ముకున్న వారికి కీలక పోస్టింగులు ఇప్పించుకోగలిగారన్న ప్రచారం జరుగుతోంది. ఇటీవల జరిగిన బదిలీల సరళిని పరిశీలిస్తే గతంలో ఆయన నియోజకవర్గ పరిధిలో విధులు నిర్వర్తించిన వారికి కీలక పోస్టులు దక్కడం గమనార్హం. ఆయనకు వ్యక్తిగత సహాయ కార్యదర్శిగా ఐదేళ్లపాటు విధులు నిర్వర్తించిన ప్రతాప్‌రెడ్డి ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో డీఆర్‌డీఏ పీడీగా పోస్టింగు పొందారు. ఇలానే పలువురు తమకు కావాల్సిన స్థానాలు దక్కించుకున్నారు.

ఈనాడు, కర్నూలు :

మాజీ మంత్రి బుగ్గన నియోజకవర్గ పరిధిలోని డోన్, బేతంచెర్ల మండలాల్లో కలిపి సుమారు ఐదేళ్లపాటు తహసీల్దారుగా పనిచేసిన నరేంద్రనాథ్‌రెడ్డి సైతం బుగ్గనకు ఆత్మీయుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన ఆశీస్సులతోనే నియోజకవర్గంలోని రెండు మండలాల్లో పూర్తికాలం పాటు విధులు నిర్వర్తించారన్న ప్రచారం ఉంది. బుగ్గన చెప్పింది చెప్పినట్లు చేయడంతో ఆయనకు సన్నిహితుడిగానూ పేరు తెచ్చుకున్నారన్న ప్రచారం ఉంది.

ఎలా సాధించుకున్నారో..

ఇటీవల జరిగిన బదిలీల్లో కీలకమైన పాణ్యం తహసీల్దారు పోస్టును ఆయన దక్కించుకున్నారు. బుగ్గనకు అత్యంత సన్నిహితుడిగా పేరు తెచ్చుకున్న సదరు అధికారి ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో కీలకమైన పాణ్యం నియోజకవర్గంలో తహసీల్దారు పోస్టు ఎలా సాధించారన్నది మిస్టరీగా మారింది.

అక్రమాలు వెలికితీసేలా..

డోన్, బేతంచెర్ల తహసీల్దారు కార్యాలయాల కేంద్రంగా పలు అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు ప్రస్తుత ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డికి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో వీటిపై రహస్య విచారణ చేయాల్సిందిగా ఎమ్మెల్యే ఆదేశించారన్న విషయం ప్రస్తుతం కలకలంగా మారింది. ఆ రెండు మండలాల పరిధిలో పెద్దఎత్తున అక్రమ లేఅవుట్లు వెలిశాయని, కొందరు ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా ఆక్రమించుకున్నారని, అసైన్డ్ భూముల్లో సంబంధం లేని వ్యక్తులు భారీ నిర్మాణాలు చేసి వ్యాపారాలు చేస్తున్నారని, ఫ్రీహోల్డ్ చేసిన భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఎస్పీ కార్యాలయంలోనే నియామకం

ప్రస్తుతం కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలోని స్పెషల్ బ్రాంచి విభాగంలో ఎస్.బి.-2 సీఐగా పోస్టింగు పొందిన కేశవరెడ్డి.. బుగ్గన స్వగ్రామమైన బేతంచెర్లలో గతంలో ఎస్సైగా విధులు నిర్వర్తించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో బేతంచెర్లలో ఎస్సైగా, సీఐగా ఐదేళ్లకు పైగా పనిచేయడంతో బుగ్గనకు కావాల్సిన అధికారిగా మారారు. బుగ్గన సూచన మేరకే విజిలెన్స్ విభాగంలోనూ సీఐగా విధులు నిర్వర్తించారన్న ప్రచారం జరుగుతోంది. గత ఐదేళ్ల కాలంలో ఉమ్మడి జిల్లాలో పోలీసులకు సంబంధించిన అన్నిరకాలైన నిర్ణయాల్లో ఆయన తెరవెనుక పాత్ర పోషించినట్లు సమాచారం. ఆయన సిఫార్సులతో పలువురు పోలీసు అధికారులు తమకు నచ్చినచోట్ల పోస్టింగులు పొందినట్లు తెలుస్తోంది. అలాంటి వ్యక్తికి సాక్షాత్తూ జిల్లా ఎస్పీ కార్యాలయంలోనే పోస్టింగు లభించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ప్రస్తుతం ఓర్వకల్లు తహసీల్దారుగా కీలకమైన పోస్టులో నియమితులైన విద్యాసాగర్ గత వైకాపా ప్రభుత్వ హయాంలో తొలి రెండున్నరేళ్లపాటు బేతంచెర్లలోనూ, ఆ తర్వాత సుమారు రెండున్నరేళ్లపాటు డోన్ తహసీల్దారుగా కొనసాగారు. ఆ రెండు మండలాలు సైతం మాజీ మంత్రి బుగ్గన ప్రాతినిధ్యం వహించిన డోన్ నియోజకవర్గంలోనివే. బుగ్గన ఆశీస్సులు సమృద్ధిగా ఉండడంతో ఆయన నియోజకవర్గంలోనే పూర్తిస్థాయిలో సేవలు అందించగలిగినట్లు ప్రచారం జరుగుతోంది.

పలుకుబడి ఉపయోగించి..

వాస్తవానికి తెదేపా హయాంలో ఆయనకు గడివేముల మండల తహసీల్దారుగా పోస్టింగు లభించింది. కర్నూలుకు 60 కి.మీ.ల దూరంలో ఉన్న గడివేములలో విధులు నిర్వర్తించడం ఆయనకు ఇష్టంలేదు. ఈ నేపథ్యంలో తనకున్న పలుకుబడిని ఉపయోగించి కేవలం నెల రోజుల వ్యవధిలోనే కర్నూలు ఆనుకుని ఉన్న కీలక మండలమైన ఓర్వకల్లు తహసీల్దారుగా పోస్టింగు దక్కించుకున్నారు. బుగ్గనకు అత్యంత సన్నిహితంగా మెలిగినప్పటికీ గత వైకాపా ప్రభుత్వంలో కంటే మరింత మెరుగైన పోస్టింగును పట్టుబట్టి మరీ దక్కించుకోగలిగారు.

దస్త్రాలు మాయం

డోన్, బేతంచెర్ల మండలాల పరిధిలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములకు సంబంధించిన దస్త్రాలు సైతం మార్చేశారన్న ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అక్రమాలు బయటపడతాయన్న ఉద్దేశంతో తహసీల్దారు కార్యాలయంలో కొన్ని దస్త్రాలు మాయం చేశారన్న ప్రచారం జరుగుతోంది. డోన్ నియోజకవర్గంలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో అక్రమ లేఅవుట్లు వెలిసినట్లు కూడా అధికారులు సైతం గుర్తించారు. ఏఏ సర్వే నంబర్లలో.. ఎంత విస్తీర్ణంలో లేఅవుట్లు వేశారన్న వివరాలను వారు అధికారికంగానూ ప్రకటించారు. రాజకీయ నాయకుల అండదండలతో అక్రమంగా లేఅవుట్లు వేసిన వారు అందులోని స్థలాలను విక్రయించి భారీగా ఆదాయం ఆర్జించారు.

టెట్‌కు వేళాయె

■ నేటి నుంచి నిర్వహణ



నంద్యాల పట్టణం, రైతునగరం, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసింది. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి నిర్లక్ష్యం చేసింది. ఎన్నికల ముందు డీఎస్సీ పేరుతో హడావుడి చేసింది. అంతలో ఎన్నికల ప్రకటన రావడంతో ఇది మూలనపడింది. మరోవైపు తాము అధికారంలోకి రాగానే డీఎస్సీ నిర్వహణకు చర్యలు తీసుకుంటామని చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా తొలుత టెట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. నంద్యాల జిల్లావ్యాప్తంగా 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష జరగనుంది. మూడు కేంద్రాల్లో ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఇప్పటికే పరీక్షా కేంద్రాలను సందర్శించిన అధికారులు చెక్‌లిస్టులు సైతం అందజేశారు. కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశాల మేరకు ఆర్టీసీ, పోలీసు, వైద్యం, విద్యుత్తు తదితర శాఖల అధికారులు సమన్వయంతో పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

రోజుకు రెండు విడతల్లో..

నంద్యాల శివారులోని ఆర్జీఎం, శాంతిరాం, ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో 8,800 మంది అభ్యర్థులు టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డును వెంట తీసుకుని కేంద్రాలకు రావాల్సి ఉంటుంది. ప్రతిరోజు రెండు విడతల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.

సహాయ కేంద్రం ఏర్పాటు

పరీక్షా కేంద్రాలకు వెళ్లే అభ్యర్థులకు ఏవైనా సమస్యలు ఎదురైతే ఫిర్యాదు చేసేందుకు నంద్యాల డీఈవో కార్యాలయంలో సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నంబర్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఏమైనా సమస్యలుంటే అభ్యర్థులు 98859 17470, 90636 60385, 95531 97786 నంబర్లను సంప్రదించవచ్చు. మరోవైపు కొంతమందిని సిబ్బందిని సైతం నియమించారు. అభ్యర్థుల హాల్‌టికెట్‌లో ఫొటో సక్రమంగా రాకపోతే కేంద్రంలోని డిపార్ట్‌మెంటల్ అధికారిని సంప్రదించవచ్చు. నిర్ణీత సమయంలోగా పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడపనున్నారు. నిరంతరం విద్యుత్తు సరఫరాతో పాటు కేంద్రాల్లో వైద్య శిబిరాలు అందుబాటులో ఉంచి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు.

సిరిధాన్యం.. సాగు దైన్యం

• డిమాండ్ పెరిగినా ఉత్పత్తులు అంతంతే



ప్రజల జీవనశైలిలో ఎన్నో మార్పులొచ్చాయి. ఆహారపు అలవాట్లు మారిపోయాయి. సిరిధాన్యాల వాడకం క్రమంగా పెరుగుతోంది. ప్రభుత్వం సైతం ప్రోత్సహిస్తోంది. అయినా ఉమ్మడి జిల్లాలో చిరుధాన్యాల సాగు ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. గతంతో పోలిస్తే కొర్రలు ఒక్కటే కొంతమేర సాగు పెరగ్గా.. మిగిలినవి అంతంతమాత్రమే. 2020 సంవత్సరంలో 8.82 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. గతేడాది 9.10 లక్షల హెక్టార్లకు పెరిగింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 4.89 లక్షల హెక్టార్లలో అన్నిరకాల పంటలు సాగయ్యాయి. చిరుధాన్యాల పరంగా పరిశీలిస్తే సాగు అంతంతమాత్రమే.

– న్యూస్‌టుడే, నంద్యాల వ్యవసాయం

గత రెండేళ్ల కాలంలో ఉమ్మడి జిల్లాలో చిరు ధాన్యాల సాగు వివరాలు (హెక్టార్లలో..)

	2022-23	2023-24	2024 (ఖరీఫ్)
జొన్నలు	32,125	36,544	2000
సజ్జ	6,026	11,681	9,601
కొర్ర	2,749	5,134	6,568
రాగులు	02	06	0

జనం ఆసక్తి చూపుతున్నా..

జొన్న అంబలి, రాగి జావ, ఉలవ చారు, కొర్రల దోశ, సామల ఉప్మా.. ఇలా చిరుధాన్యాల ఆహారంపై జనంలో ఆసక్తి పెరుగుతోంది. విపణిలో వీటికి మంచి డిమాండ్ ఉంది. పదేళ్ల కిందట చిరుధాన్యాల వినియోగం 10 శాతం వరకు ఉండగా.. ప్రస్తుతం 30-40 శాతానికి పైగా పెరిగింది. ఉమ్మడి జిల్లాలో సాగు మాత్రం పెరగడం లేదు. చాలామంది రైతులు వరి, పత్తి, మిరప తదితర వాణిజ్య పంటల సాగుకే మొగ్గు చూపుతున్నారు. మారుతున్న జీవనశైలి నేపథ్యంలో చిరుధాన్యాల ప్రాధాన్యం పెరుగుతున్నా స్థానికంగా పంటలు లేక ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది.

కాగితాల్లో ఘనం..

2023 సంవత్సరాన్ని కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. 2022 ఖరీఫ్‌లో 7,012 ఎకరాల్లో చిరు ధాన్యాల పంటలు సాగయ్యాయి. 2023 ఖరీఫ్‌లో 21,825 ఎకరాలకు పెరిగినట్లు అధికారులు చెబుతున్నా అదంతా కాగితాలకే పరిమితమైంది. క్షేత్రస్థాయిలో పంటల ఊసే లేదు. చిరు ధాన్యాలకు ధర లేనప్పుడు రైతులు నష్టపోకుండా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయిస్తోంది. రాయితీపై విత్తనాలు అందిస్తోంది. ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. వ్యవసాయ శాఖ మాత్రం సాగు పెరిగేలా చర్యలు తీసుకోవడం లేదు.

విస్తీర్ణం తగ్గుతోంది..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2014-15 సంవత్సరంలో 10,11,205 హెక్టార్ల సాగు భూమి ఉండేది. 2019-20లో 9.37 లక్షల హెక్టార్లు, 2020-21లో 8.82 లక్షల హెక్టార్లు, 2021-22 సంవత్సరానికి 8,77,304 హెక్టార్లకు పడిపోయింది. 2022-23లో 9.25 లక్షల హెక్టార్లు, 2023-24లో 9,10,432 హెక్టార్లలో సాగు ఉంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో 4.89 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. 2014-15 నుంచి 23-24 వరకు పరిశీలిస్తే లక్ష హెక్టార్లలో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది.

● 2020 నుంచి 2024 ఖరీఫ్ వరకు ఉమ్మడి జిల్లాలో అండు కొర్రలు, ఊదలు, వరిగలు, సామలు, అరికలు ఒక్క ఎకరా కూడా సాగవలేదు.

విధిగా లక్ష్యం విధిస్తేనే..

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కొర్రలు సాధారణ సాగు 10 వేల హెక్టార్లు ఉండగా.. ప్రస్తుతం ఆరు వేల హెక్టార్లకుపైగా సాగవుతోంది. అండు కొర్రలు, ఊదలు, అరికలు, రాగుల కొనుగోళ్లు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. రోజుకు దాదాపు 850-1000 కిలోల వరకు అమ్మకాలు సాగుతున్నాయి. ఇక్కడ పంటలు లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు తెప్పించి కిలో రూ.200-300 వరకు విక్రయిస్తున్నారు. నెలకు 300 క్వింటాళ్లు, ఏడాదికి 3,600 క్వింటాళ్ల వరకు అమ్మకాలు సాగుతున్నాయి. ఏటా చిరు ధాన్యాల వ్యాపారమే రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్లు దాటుతుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో వ్యవసాయ వార్షిక ప్రణాళికలో విధిగా గ్రామాలవారీగా చిరు ధాన్యాల సాగు లక్ష్యం నిర్ణయించాల్సి ఉంది.



వీరభద్రస్వామికి మంగళహారతి ఇస్తున్న అర్చకులు

బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలోని క్షేత్ర పాలకుడు బయలు వీరభద్రస్వామికి బుధవారం అమావాస్యను పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వీరభద్రస్వామికి పంచామృతాభిషేకం, పవిత్ర జలాలతో అభిషేకాలు చేశారు. ఈ పూజల్లో దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు దంపతులు పాల్గొన్నారు. లోక కల్యాణార్థం దేవస్థానం ఈ విశేష పూజలు జరిపిస్తోంది. భక్తులు సైతం స్వామివారిని దర్శించుకున్నారు.

స్వచ్ఛతాహి సేవలో భాగస్వాములవ్వండి 8

పాత పింఛను విధానం అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న సంఘం నాయకులు

నంద్యాల పాత పట్టణం, న్యూస్‌టుడే : ఉద్యోగులకు పాత పింఛను విధానం అమలు చేయాలని ఏపీ సీపీఎస్ఈఏ (ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్) నాయకులు డిమాండు చేశారు. నంద్యాలలో బుధవారం గాంధీ విగ్రహానికి నివాళి అర్పించి నిరసన తెలిపారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పింఛను విధానం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్‌రెడ్డి, బాలమద్దయ్య, రామచంద్రారెడ్డి, శివయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నంద్యాలకు తరలిన మహానందీశుడు



మహానంది నుంచి నంద్యాలకు బయలుదేరిన స్వామివారు

మహానంది, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణంలోని బ్రహ్మనందీశ్వర ఆలయంలో జరిగే దసరా మహోత్సవాల విజయవంతానికి కార్యకర్తగా గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి తరలివెళ్లారు. దేవస్థానంలోని అలంకార మండపంలో ఉత్సవమూర్తులకు ఈవో శ్రీనివాసరెడ్డి, ఏఈవో మధు, కూరగాయల దాత ప్రసాద్ చేత ప్రధానార్చకులు బుధవారం పూజలు చేయించారు. ఆనవాయితీ ప్రకారం దసరా ఉత్సవాల ప్రారంభానికి ఒకరోజు ముందుగా స్వామివారు నంద్యాలకు బయలుదేరుతారు. దసరా అనంతరం మహానంది క్షేత్రానికి చేరుకుంటారు.

ఇసుకే బంగారం.. నమోదుకు జాగారం



■ అవసరం ఎక్కువ.. లభ్యత తక్కువ

జిల్లాలో ఇసుక నిల్వలు లేవు. వినియోగదారుల అవసరాలకు తగ్గట్టు జిల్లాకు సరఫరా కావడం లేదు. డిమాండ్ అధికంగా ఉండటంతో స్లాట్ తెరిచిన కొద్ది గంటల్లోనే నమోదు పూర్తవుతోంది. స్లాట్‌ను అర్ధరాత్రి సమయంలో తెరుస్తుండటంతో నిర్మాణదారులు బుకింగ్ కోసం జాగారం చేయాల్సి వస్తోంది. అయినప్పటికీ అవకాశం లభించడం లేదు.

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే:

వారాల తరబడి ఎదురు చూడాల్సిందే..

జిల్లాలో గత నెల 29న స్లాట్ తెరిచారు. ఆ రోజు నమోదు చేసుకున్న వారికి ఈనెల 5వ తేదీలోగా ఇసుక సరఫరా చేస్తామని సమాచారం ఇచ్చారు. సరఫరా పూర్తయ్యాక అందుబాటులో ఉన్న ఇసుక నిల్వలను బట్టి మళ్లీ వారం రోజులకు బుకింగ్ తెరుస్తారు. అంటే గత నెల 29న బుకింగ్ చేసుకోలేకపోయినవారు వారం వేచి చూడాల్సిందే. అత్యవసరంగా అవసరమైన వినియోగదారుల తిప్పలు అన్నీఇన్నీ కావు.

కర్నూలు జిల్లాలోని రీచ్‌ల నుంచి నంద్యాల జిల్లాకు ఇసుక సరఫరా అవుతోంది. టన్ను ఇసుక రూ.1,450 ధరతో (రవాణాతో సహా) సరఫరా చేస్తున్నారు. వైఎస్సార్ జిల్లా నుంచి వచ్చే ఇసుక ధర రూ.1,550 ఉంది. కర్నూలు నుంచి వస్తున్న ఇసుక కొంత లావుగా ఉంటోంది. ఇది నిర్మాణాల ప్లాస్టింగ్‌కు ఉపయోగపడదు. దీంతో ప్లాస్టింగ్ కోసం వైఎస్సార్ జిల్లా నుంచి తెచ్చుకోవాల్సిందే. ఈ రకం ఇసుక ధర రూ.1,850 వరకు ఉంది.

అమాంతం పెరిగిన డిమాండ్

వైకాపా ప్రభుత్వంలో ఇసుక సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. సామాన్యులకు ఇసుక దొరకడం కష్టమైంది. మూడు నెలల కిందట కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చింది. గత నెలలో భారీ వర్షాలు కురవడంతో ఇసుక సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో నిర్మాణ రంగం ఊపందుకుంది. డిమాండ్ పెరగడంతో బుకింగ్ ప్రారంభించిన కొన్ని గంటల్లోనే స్లాట్ ముగిసిపోతోంది.

దళారుల దోపిడీ

స్లాట్ తెరిచిన సమయంలో చాలామంది వినియోగదారులు ఇసుక కోసం నమోదు చేసుకోలేకపోతున్నారు. వీరి అవసరాన్ని ఆసరాగా చేసుకుని దళారులు దోపిడీకి దిగారు. నంద్యాలతోపాటు ఆళ్లగడ్డ, ఆత్మకూరు, బనగానపల్లి, కోవెలకుంట్ల, బేతంచెర్ల వంటి పట్టణాల్లో పదుల సంఖ్యలో దళారులు పుట్టుకొచ్చారు. టన్నుపై రూ.200 అధికంగా ఇస్తే వారే నేరుగా ఇసుక సరఫరా చేస్తున్నారు. దళారులు సరఫరా చేసే ఇసుక ధర జిల్లాలో టన్ను రూ.1,650 వరకు ఉంటోంది. వైఎస్సార్ జిల్లా నుంచి వచ్చే నాణ్యమైన ఇసుకకు రూ.1,850పైగా వసూలు చేస్తున్నారు.

అడ్డదారిలో నమోదు

స్లాట్ నమోదులో దళారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వేర్వేరు వ్యక్తుల పేర్లతో బుక్ చేసుకుంటున్నారు. కొనుగోలు చేసిన ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మరికొందరు కర్నూలు జిల్లాలో రీచ్‌ల నుంచి కొనుగోలు చేసి ఒప్పందం చేసుకున్న వారికి అందించి సొమ్ము చేసుకుంటున్నారు.

అర్ధరాత్రి అవస్థలు

ఇసుకకు డిమాండ్ భారీగా ఉండటంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం వారానికి ఒకసారి ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం కల్పిస్తోంది. బుకింగ్ స్లాట్‌ను అర్ధరాత్రి 12 గంటలకు తెరుస్తుండటంతో సమస్యలు తప్పడం లేదు. ఇసుక కోసం జాగారం చేయాల్సి వస్తోంది. స్లాట్ తెరిచిన కాసేపట్లోనే నమోదు పూర్తవడం సాధారణంగా మారిపోయింది. అర్ధరాత్రి స్లాట్ ఇవ్వడంతో ఇబ్బందులు పడుతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత సచివాలయాల్లో స్లాట్ తెరిచేలా చర్యలు తీసుకుంటామని గతంలో అధికారులు ప్రకటించినా ఎక్కడా అమలు కావడం లేదు.

● జిల్లాలో గత నెల 29న ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు ఇసుక బుకింగ్ స్లాట్ తెరిచారు. 723 మంది వినియోగదారులు సుమారు 16 వేల టన్నుల ఇసుక కోసం నమోదు చేసుకున్నారు. కాసేపట్లోనే స్లాట్ నమోదు పూర్తవడంతో చాలామందికి నిరాశే మిగిలింది.

నవదుర్గా నమోస్తుతే

☛ శ్రీగిరిలో నేటి నుంచి దసరా ఉత్సవాలు
☛ భ్రమరాంబాదేవికి రోజుకో అలంకరణ

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : ఇల కైలాసం శ్రీశైలంలో గురువారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు దసరా మహోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ఉత్సవాల్లో భ్రమరాంబాదేవి నవదుర్గల రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఒక్కో రూపంలోని అమ్మవారిని దర్శించుకుని, పూజించడం వల్ల కష్టాలు తొలిగిపోయి, సుఖసంతోషాలు ప్రాప్తిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. ఎక్కడా లేని విధంగా శ్రీశైలంలో మార్కండేయ పురాణాన్ని అనుసరించి నవదుర్గల అలంకారం, పూజలు, గ్రామోత్సవం నిర్వహించడం విశేషం.

తేజోమయం.. శైలపుత్రి రూపం



నవరాత్రుల్లో మొదటి రోజు అమ్మవారు శైలపుత్రిగా దర్శనమిస్తారు. శైలపుత్రి అమ్మవారు సిగలో బాలచంద్రుని ఆభరణంగా ధరించి తేజోమయ రూపంలో దర్శనమిస్తారు. కుడి చేత శూలం, ఎడమ చేత పద్మాన్ని ధరించి వృషభ వాహనంపై అమ్మవారు దర్శనమిస్తారు.

బ్రహ్మచారిణి అలంకారం



శరన్నవరాత్రుల్లో అమ్మవారి రెండో స్వరూపం బ్రహ్మచారిణి. కుడి చేత జపమాల, ఎడమ చేత కమండలాన్ని ధరించి ఉంటారు. బ్రహ్మచారిణి పూర్వ జన్మలో హిమవంతుని ఇంట పార్వతిగా అవతరించినట్లు పురాణాలు చెబుతున్నాయి. నారద మహర్షి ఉపదేశంతో పరమశివుని భర్తగా పొందేందుకు కఠోర తపస్సు చేపడతారు. బ్రహ్మచారిణిని ఆరాధించడం వల్ల త్యాగ, వైరాగ్య భావనలు కలుగుతాయని దేవీ భాగవతం చెబుతోంది.

చంద్రఘంట.. సుగుణాల మూట



నవదుర్గల్లో మూడో స్వరూపం చంద్రఘంటాదేవి. ఈమె పది చేతులు కలిగుంటారు. కుడి వైపున పద్మం, బాణం, ధనస్సు, అభయహస్తం, జపమాల, ఎడమ వైపున త్రిశూలం, గద, ఖడ్గం, పంచముద్ర, కమండలాన్ని ధరించి ఉంటారు. చంద్రఘంటాదేవి మస్తకంపై ఘంటాకారంలో అర్ధ చంద్రుడు అలరారుతుంటాడు. ఈ అమ్మవారు భక్తుల కష్టాలను త్వరగా తీరుస్తారని ప్రతీతి. ఈ దేవిని ఆరాధించడం వల్ల సౌమ్యం, వినమ్రత, సద్గతి వంటి సుగుణాలు ప్రాప్తించడమే కాకుండా నిర్భయులుగా ఉంటారు.

ఆదిశక్తి.. కూష్మాండ దుర్గ



పరాశక్తి నవదుర్గ రూపాల్లో నాలుగో స్వరూపం కూష్మాండదుర్గ. ఈ దేవి ఎనిమిది భుజాలను కలిగుండటం వల్ల అష్టభుజాదేవిగా కీర్తించబడుతోంది. కూష్మాండ దుర్గ ఎనిమిది చేతుల్లో కుడి వైపున పద్మం, బాణం, ధనస్సు, కమండలాన్ని, ఎడమ వైపున చక్రం, గద, జపమాల, అమృత కలశాన్ని ధరించి ఉంటుంది. కూష్మాండ దుర్గ తన చిరునవ్వుతో చరాచర జగత్తును సృష్టించిందని పురాణాలు చెబుతాయి. సృష్టి లేని సమయంలో బ్రహ్మాండాన్ని సృష్టించినందు వల్ల ఈ దేవిని ఆదిశక్తిగా కీర్తిస్తారు. అమ్మవారికి కూష్మాండ (గుమ్మడికాయ) బలి ప్రీతికరమైనది కావడం వల్ల కూష్మాండదుర్గగా ప్రసిద్ధి చెందింది.

ఇష్టకామ్యాలు నెరవేర్చే స్కందమాత



ఐదో స్వరూపం స్కందమాత. ఈ దేవి చతుర్భుజాలను కలిగుంటారు. ఈమె ఒడిలో బాలుని రూపంలో షణ్ముఖుడైన కుమారస్వామి కూర్చొని ఉంటారు. స్కందమాత చతుర్భుజాల్లో పై రెండు చేతుల్లో పద్మాలు, కుడి వైపు కింది చేత్తో ఒడిలోని కుమారస్వామిని పట్టుకొని ఉండగా, ఎడమ వైపు కింది చేయి అభయహస్తంగా ఉంటుంది. స్కందుడైన (కుమారస్వామి) తల్లి కావడం వల్ల ఈమె స్కందమాతగా ప్రసిద్ధి చెందారు. ఈ దేవిని ఆరాధించడం వల్ల ఇష్టకామ్యాలు నెరవేరుతాయని దేవీ భాగవతం చెబుతోంది.

కాత్యాయని.. ఆరోగ్య ప్రదాయిని



నవదుర్గల్లో ఆరో స్వరూపం కాత్యాయని అలంకారం. ఈ దేవిని శివశక్తి స్వరూపంగా పూజిస్తారు. కాత్యాయని దేవి చతుర్భుజాలను కలిగుంటారు. కుడి వైపున అభయ హస్తం, వరదముద్రలతోనూ, ఎడమ వైపు పద్మం, ఖడ్గాన్ని ధరించి ఉంటారు. ఈ దేవిని ఆరాధించడం వల్ల రోగ, శోక, భయాలను పోగొడుతుందని భక్తుల విశ్వాసం.

నవరాత్రుల్లో నివేదనలు

శ్రీశైల మహాక్షేత్రంలో నవదుర్గలుగా దర్శనమిచ్చే అమ్మవారికి ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు దద్దోజనం (పెరుగన్నం), 11.30కు కదంబం ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. రాత్రి 9 గంటలకు రాజభోగంగా మహానివేదన చేస్తారు. ఉత్సవమూర్తికి తొమ్మిది రకాల ప్రసాదాలను నివేదనగా సమర్పిస్తారు. శ్రీశైలంలో అమ్మవారికి నివేదనగా సమర్పించే కదంబం ప్రసాదం ఎంతో విశేషమైనదిగా చెబుతారు.

కాళరాత్రి.. దుష్ట సంహారిణి



అమ్మవారి ఏడో స్వరూపం కాళరాత్రి. ఈ దేవి నల్లని దేహఛాయతో జుట్టు విరబోసుకొని పెడ బొబ్బ నవ్వులతో చూడ్డానికి భయంకరంగా ఉన్నప్పటికీ భక్తజనులకు శుభ ఫలితాలు ఇస్తుందన్నది శాస్త్ర వచనం. ఈమె చతుర్భుజాలను కలిగుంటారు. కుడి వైపున అభయహస్తం, వరదముద్రను, ఎడమ వైపున ఖడ్గం, లోహకంటకాన్ని ధరించి ఉంటారు. కాళరాత్రి దేవి దుష్టులను నాశనం చేస్తుంది. కాళరాత్రి దేవిని స్మరించినంతనే భూత, ప్రేత, పిశాచాదులు భయపడి పారిపోతాయి.

శాంతమూర్తి మహాగౌరి



ఎనిమిదో స్వరూపం మహాగౌరి. ఈమె అత్యంత శాంతమూర్తి. ఈ దేవి చతుర్భుజాలను కలిగుంటారు. కుడివైపు పైచేతిలో త్రిశూలం, కింద అభయహస్తం, ఎడమవైపు పైచేయి వరదముద్ర, కింది చేతిలో ఢమరుకాన్ని కలిగుంటారు. మహాగౌరి తన పార్వతీరూపంలో పరమశివుని భర్తగా పొందేందుకు కఠోర తపస్సు చేసింది. తపస్సు కారణంగా ఈమె నల్లబడింది. తపస్సుకు ప్రసన్నుడైన పరమశివుడు ఆమె శరీరంపై గంగాజలాన్ని చిలకరించారు. అప్పుడు ఆ దేవి తేజోవంతమైన గౌరవర్ణంలో అలరారింది. అందుకే ఈమె మహాగౌరిగా పిలుబడుతున్నారు.

సిద్ధుల ప్రదాయిని సిద్ధిదాత్రి



నవదుర్గ స్వరూపాల్లో చివరిది సిద్ధిదాయిని. ఈ దేవి చతుర్భుజాలను కలిగుంటారు. కుడి వైపున చక్రం, గద, ఎడమ వైపున శంఖం, కమలాన్ని ధరించి ఉంటారు. మార్కండేయ పురాణం అణిమ, మహిమ మొదలైన ఎనిమిది సిద్ధులను పేర్కొంటుంది. బ్రహ్మవైవర్త పురాణంలోని శ్రీకృష్ణ జన్మ ఖండంలో ఈ సిద్ధులు పద్దెనిమిదిగా చెప్పబడ్డాయి. సిద్ధిదాయిని పూజించడం వల్ల ఈ సిద్ధులన్నింటినీ పొందవచ్చని దేవీభాగవతం చెబుతోంది.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

నందవరం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండల పరిధిలోని నందవరం చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో నేటి నుంచి దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. బుధవారం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. అక్టోబరు 3 నుంచి 12 వరకు చౌడేశ్వరిదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా 3న శైలపుత్రి, 4న బ్రహ్మచారిణి, 5న చంద్రఘంట, 6న కూష్మాండ, 7న స్కంధమాత, 8న కాత్యాయని, 9న కాళరాత్రి, 10న మహాగౌరి, 11న సిద్ధిధాత్రి, 12న చౌడేశ్వరిగా భక్తులకు దర్శనమిస్తారన్నారు.



విద్యుత్తు దీపాల అలంకరణలో చౌడేశ్వరిదేవి ఆలయం

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహస్వామి నవరాత్రి ఉత్సవాలు నేటి నుంచి ఆరంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా పది రోజుల పాటు ప్రహ్లాదవరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు తిరుమంజనం, ఉత్సవం నిర్వహించనున్నారు. 12న విజయదశమి సందర్భంగా జమ్మి చెట్టు ఉత్సవంతో పాటు వేదాంత దేశికన్ జయంతి వేడుకలు ఉంటాయని ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్ తెలిపారు.

స్వచ్ఛతాహి సేవలో భాగస్వాములవ్వండి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : జాతిపిత మహాత్మగాంధీ ఆశయ సాధన కోసం చేపట్టిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలను 15 రోజుల పాటు పటిష్టంగా నిర్వహించారని తెలిపారు. నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో బుధవారం నిర్వహించిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి మంత్రి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ. . వ్యక్తిగత, పరిసరాల అపరిశుభ్రత కారణంగానే మలేరియా, డెంగీ ఇతర వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. మన జీవితాల్లో స్వచ్ఛత భాగం కావాలన్నారు. ఐదేళ్ల పాటు స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహిస్తే నంద్యాలను స్వచ్ఛ జిల్లాగా మార్చవచ్చన్నారు. అనంతరం మంత్రి, కలెక్టర్ పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. అంతకు ముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డీఆర్వో పద్మజ, జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, పురపాలక కమిషనర్ నిరంజన్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, డీసీహెచ్‌ఎస్ డా.జఫ్రుల్లా, డీపీవో మంజుల వాణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన



పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన మంత్రి ఫరూక్, కలెక్టర్ తదితరులు

మహాత్ముని జీవితం స్ఫూర్తిదాయకం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మహాత్ముని జీవితం స్ఫూర్తిదాయకమని, ఖైదీలు సత్ప్రవర్తనతో మంచి జీవితం కొనసాగించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్థి సూచించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం కర్నూలు మండలం పంచలింగాలలోని జిల్లా కారాగారంలో ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. గాంధీ ప్రతిమకు నివాళి అర్పించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

దత్తగిరి ఆశ్రమంలో తెలంగాణ మంత్రి

శ్రీశైలం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలోని పాతాళగంగ రోడ్డులో ఉన్న దత్తగిరి ఆశ్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం సందర్శించారు. ఆశ్రమంలో గురువారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు జరగనున్న శతచండీ యాగంలో పాల్గొనాలని ఆశ్రమ నిర్వాహకుడు దత్తగిరిస్వామి మంత్రిని ఆహ్వానించారు. ఆయనకు శేషవస్త్రాలు అందించి ఆశీర్వదించారు.

గాంధీ జయంతి వేడుకల్లో గొడవ

నందికొట్కూరు, న్యూస్‌టుడే : మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా నందికొట్కూరులో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే జయసూర్య సమక్షంలోనే పురపాలక ఛైర్మన్ సుధాకరరెడ్డి, కౌన్సిలర్ జాకీర్ మధ్య వాగ్వాదం జరిగింది. పురపాలక ఛైర్మన్, జాకీర్‌లు వేర్వేరు వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గాంధీ దంపతుల విగ్రహాలకు పూలమాల వేసే విషయమై వీరి మధ్య వివాదం తలెత్తింది. తాను పూలమాల వేసేందుకు వెళ్లగా ఛైర్మన్ నెట్టేశారని జాకీర్ ఆరోపించారు. ఈ విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఎమ్మెల్యే, స్థానిక నాయకులు, సీఐ కల్పించుకుని సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

జారి పడి మహిళ దుర్మరణం

ప్యాపిలి, న్యూస్‌టుడే: మండలంలోని బావిపల్లె గ్రామ సమీపంలో బంగారమ్మ గుట్ట వద్ద వజ్రాల కోసం వచ్చి బోయ ఈరమ్మ (50) మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు. కోడుమూరు మండలం మెరుగుదొడ్డికి చెందిన బోయ ఈరమ్మ తన సొంత గ్రామం నుంచి నాలుగు రోజుల కిందట వజ్రాలు ఏరుకోవడానికి ప్యాపిలి మండలంలోని బావిపల్లె గ్రామ సమీపంలో బంగారమ్మ గుట్ట వద్దకు వచ్చింది. వజ్రాలు ఏరుకుంటూ గుట్టలోని రాళ్లలో జారిపడి తలకు తీవ్ర గాయాలై ఆమె అక్కడికక్కడే చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలి వద్ద ఉన్న చరవాణి ద్వారా బంధువులకు సమాచారం ఇచ్చి వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జలదుర్గం ఎస్సై నాగార్జున బుధవారం తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

చిన్నబోధనం(చాగలమర్రి), న్యూస్‌టుడే: మండలంలోని చిన్నబోధనానికి చెందిన పాపిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి(28) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని ఎస్సై రమేష్‌రెడ్డి బుధవారం తెలిపారు. మొక్కజొన్న పొలం వద్దకు ఈనెల 1న ఉదయం వెళ్లాడని, సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు వెతకగా రాత్రి గట్టుపై చనిపోయి కనిపించాడన్నారు. యువకుడు కుడికాలు, కుడి పిక్క వద్ద చర్మం లేచిన గాయాలు కనిపించడంతో తండ్రి రాజేశ్వర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

మద్యానికి డబ్బివ్వలేదని ఆత్మహత్య

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణానికి చెందిన తేజారావు (22) మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. రెండో పట్టణ పోలీసుల వివరాల మేరకు.. గిరినాథ్ సెంటర్‌కు చెందిన శాంతాబాయి, సుబ్బారావు దంపతుల కుమారుడు తేజారావు. తండ్రి కొన్నేళ్ల కిందట మృతి చెందారు. తేజారావు ఓ చికెన్ దుకాణంలో పనిచేసేవాడు. మంగళవారం రాత్రి మద్యం తాగేందుకు తల్లిని డబ్బులు అడగ్గా ఇవ్వనని చెప్పడంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం స్థానిక జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: దేవరబండ గ్రామ బస్‌స్టేజీ సమీపంలో స్కార్పియో వాహనంలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న నలుగుర్ని గ్రామీణ సీఐ రాకేశ్, సిబ్బందితో కలసి అదుపులోకి తీసుకున్నారు. బుధవారం గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డోన్ డీఎస్పీ శ్రీనివాసులు వివరాలు వెల్లడించారు. దేవరబండకు చెందిన ఈడిగ రవి, ఈడిగ మధు, యు.కొత్తపల్లికి చెందిన షేక్‌నడిపి హుసేన్‌పీరా, షేక్ షాదిక్‌బాషా కర్ణాటకలోని పావుగడలో వైన్‌షాప్‌లో మద్యం విక్రయించి స్కార్పియో వాహనంలో తీసుకుని వచ్చి ఇక్కడ గ్రామాల్లో విక్రయిస్తుంటారని పేర్కొన్నారు. 2,112 టెట్రా ప్యాకెట్లుతో పాటు నంబర్‌ప్లేటు లేని ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. గతంలో షేక్ నడిపి హుసేన్‌పీరాపై అక్రమ మద్యం కేసులో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయిందన్నారు. నలుగురిపై రౌడీషీట్ తెరుస్తామని, పాత మద్యం కేసులలో ముద్దాయిలుగా ఉన్న వారిపై కూడా షీట్ తెరుస్తామన్నారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.



మాట్లాడుతున్న డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రాకేశ్

వేల్పనూరులో చోరీ

వేల్పనూరు (వెలుగోడు), న్యూస్‌టుడే : వెలుగోడు మండలంలోని వేల్పనూరుకు చెందిన ఆమంచి వెంకటేశ్వర్లు ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆత్మకూరు సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. వెంకటేశ్వర్లు నాలుగు రోజుల కిందట ఇంటికి తాళం వేసి వేరే ఊరు వెళ్లారు. మంగళవారం తిరిగొచ్చిన ఆయన ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించారు. దొంగలు 16 తులాల బంగారు ఆభరణాలు, రూ.30 వేల నగదు అపహరించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేశారు. బుధవారం సీఐ ఘటనా స్థలానికి క్లూస్‌టీంతో వెళ్లి వేలిముద్రలు సేకరించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణం గుడిపాటిగడ్డ వీధిలో సెప్టెంబరు 30న చోటుచేసుకున్న సాయిమనోహర్ హత్య కేసులో నిందితుడు దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు ఒకటో పట్టణ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో బుధవారం నిందితుడిని చూపుతూ వివరాలు వెల్లడించారు. సాయిమనోహర్‌కు తన భార్యతో వివాహేతర సంబంధం ఉందని అనుమానించిన దుర్గాప్రసాద్ అతన్ని ఎలాగైనా హతమార్చాలని కుట్ర పన్నాడు. సెప్టెంబరు 30న అర్ధరాత్రి తన భార్యతో మాట్లాడుతున్న సాయిమనోహర్‌తో దుర్గాప్రసాద్ ఘర్షణకు దిగి కత్తితో దాడి చేశాడు. గాయపడిన అతన్ని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ మేరకు దుర్గాప్రసాద్‌పై కేసు నమోదు చేసి బుధవారం చెరువు కట్ట వద్ద ఉన్న అతన్ని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సుధాకర్‌రెడ్డి

ఆర్థిక సాయం అందజేత

అవుకు, న్యూస్‌టుడే: పిడుగు పడి గొర్రెలు చనిపోయిన ఘటనలో ఆర్థిక సాయం చెక్కులను తెదేపా నాయకుడు ఉగ్రసేనారెడ్డి బుధవారం బాధితులకు అందజేశారు. గత ఆగస్టు 19న సంగపట్నానికి చెందిన జి.వెంకటేశ్వర్లు, సుంకమ్మలకు చెందిన 43 గొర్రెలు, మేకలు చనిపోవడంతో ఒక్కో జీవానికి రూ7,600 ప్రకారం రూ 3.38 లక్షలను ప్రభుత్వం పరిహారంగా ప్రకటించింది. వైద్యాధికారి బ్రహ్మానందరెడ్డి, ఎల్‌ఎస్‌ఏ రాజేష్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.1.07 లక్షల విరాళం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల ప్రైవేటు పాఠశాలల యజమానులు వరద బాధితుల సహాయార్థం రూ.1.07 లక్షల విరాళం అందజేశారు. తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్‌ను వికాస్, రాయల్, నారాయణ, నలంద, నవభారత్, అభ్యుదయ, నేషనల్, ఆల్ఫా పాఠశాల కరస్పాండెంట్లు వలి, ఇషాక్‌వలి, ఉత్తేజ్, ఖాజా హుస్సేన్, హుసేన్‌వలి, ఇర్ఫాన్ తదితరులు బుధవారం కలిసి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు సుధాకర్, దస్తగిరి, యాకుబ్, రఘు, రోహిత్, రాజేశ్, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫిరోజ్‌కు చెక్కు అందజేస్తున్న ప్రైవేట్ స్కూల్ యజమానులు

రైతు శిక్షణకు శ్రీకారం

❍ గత ఐదేళ్లు నిర్వీర్యం చేసిన వైకాపా
❍ కూటమి ప్రభుత్వం నిధులివ్వడంతో మొదలైన సేవలు

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే : పంటల సాగులో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులు. . ఆధునిక విధానాలు.. తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు వివరిస్తూ.. వ్యవసాయంలో అన్నదాతలు అధిక దిగుబడులు సాధించేలా సహకరించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన రైతు శిక్షణ కేంద్రానికి ఐదేళ్ల తర్వాత మోక్షం వచ్చింది. గత వైకాపా ప్రభుత్వం ఈ కేంద్రానికి పైసా నిధులు కేటాయించకపోవడంతో ఐదేళ్ల పాటు శిక్షణ కార్యక్రమాలు ఆగిపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇటీవల ఈ కేంద్రానికి నిధులు కేటాయించడంతో మళ్లీ సేవలు మొదలయ్యాయి.



రైతులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

◆ జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ), రైతు శిక్షణ కేంద్రంగా (ఎఫ్‌టీసీ) ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టేవారు. గత ఐదేళ్ల కాలంలో అవన్నీ నిలిచిపోయాయి. రాష్ట్రీయ కృషి విజ్ఞాన యోజన (ఆర్‌కేవీవై), జాతీయ ఆహార భద్రత మిషన్ (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం), సీడ్ విలేజీ ప్రోగ్రాం (ఎస్‌వీపీ) తదితర పథకాల కింద నిధులు కేటాయించే వారు. గత వైకాపా ప్రభుత్వం వీటన్నింటికీ నిధులు ఇవ్వకపోవడంతో రైతులకు అవసరమైన కార్యక్రమాలన్నీ నిలిచిపోయినట్లు అధికారులు చెబుతున్నారు.

రూ.6.81 లక్షల విడుదల

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రైతు శిక్షణ కేంద్రానికి రాష్ట్రీయ కృషి విజ్ఞాన యోజన పథకం (ఆర్‌కేవీవై) కింద రూ.6.81 లక్షల నిధులు విడుదల చేసింది. దీంతో ఈ కేంద్రం సేవలు పునఃప్రారంభమయ్యాయి. మిగతా పథకాలకు కూడా నిధులు వచ్చే అవకాశం ఉండటంతో ఇప్పటికే రైతులకు శిక్షణ కార్యక్రమాలను చేపట్టారు.

చేపట్టనున్న కార్యక్రమాలు

◆ రైతు శిక్షణ కేంద్రం ద్వారా మూడు రకాల కార్యక్రమాలు ఉన్నాయి.

రైతులకు శిక్షణ : గ్రామాలకు వెళ్లి అక్కడ సాగుచేసే ప్రధాన పంటకు సంబంధించిన సాగు, యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించాలి. ఇలాంటి కార్యక్రమాలు ఏడాదిలో 40 వరకు చేపట్టాల్సి ఉంది.

వ్యవసాయ సిబ్బందికి శిక్షణ : కొత్తగా వచ్చే వ్యవసాయ పద్ధతులు, ఆధునిక విధానాలు, ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేయబోతున్న పథకాలపై వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇస్తారు. ఇలాంటి కార్యక్రమాలు నాలుగు నిర్వహించాల్సి ఉంటుంది.

పంటల పరిశీలన : జిల్లాలో సాగుచేసిన పంటలను ఆశించిన తెగుళ్లు, చీడపురుగులను గుర్తించాలి. సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలకు శాస్త్రవేత్తలతో కలిసి వెళ్లి పరిశీలించాలి. సమస్య పరిష్కారానికి తగిన సూచనలు, తెగుళ్ల నివారణ మార్గాలను సూచించాలి.

పలు అంశాలపై అవగాహన కల్పిస్తాం

- సరళమ్మ, జిల్లా వ్యవసాయ శిక్షణ అధికారిణి, నంద్యాల



రైతు శిక్షణ కేంద్రానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో దీని ద్వారా రైతులకు అందాల్సిన సేవలను ఇప్పటికే ప్రారంభించాం. గ్రామాల్లో పర్యటించి పంట సాగులో ఎదురయ్యే సమస్యలపై రైతులకు వివరిస్తున్నాం. యాజమాన్య పద్ధతులు, మందుల వాడకం, తెగుళ్ల నివారణపై శిక్షణ ఇస్తున్నాం.

ఘనంగా తిరునక్షత్ర వేడుకలు

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మొదటి పీఠాధిపతి ఆదివన్ శఠగోప యతీంద్ర మహాదేశికన్ తిరునక్షత్ర వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పీఠాధిపతి ఉత్సవమూర్తిని ఉదయం పంచామృతాలతో అభిషేకించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం విశేషంగా అలంకరించి పల్లకిపై కొలువుదీర్చి తిరువీధుల్లో ఊరేగించారు. అర్చకులు వేదప్రబంధ పారాయణాలు పఠించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.



విశేష అలంకరణలో స్వామివారు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య డిమాండ్ చేశారు. నంద్యాల బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు చేపట్టిన నిరాహార దీక్ష బుధవారం రెండోరోజూ కొనసాగింది. సీఐటీయూ నాయకుడు మద్దులు, సీపీఐ నాయకుడు సంజీవులు దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపకపోతే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో ప్రసాద్, సోమన్న, బాలవెంటక్, శ్రీనివాసులు, లక్ష్మణ్, జైలాన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన దీక్ష చేస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు

గాంధీజీ అన్నితరాలకు ఆదర్శప్రాయులు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : అహింసా మార్గంలో సత్యాగ్రహమే ఆయుధంగా పోరాడి బ్రిటిష్ పాలకులను దేశం నుంచి తరిమికొట్టిన మహాత్మాగాంధీ అన్ని తరాలకు ఆదర్శప్రాయులని ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమాజంలో మనం కోరుకునే మార్పు ముందుగా మనతోనే మొదలవ్వాలన్న మహాత్ముడి బోధనను ప్రతిఒక్కరూ ఆచరించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా

నంద్యాల

•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

గ్రామ స్వరాజ్యం తెదేపాతోనే సాధ్యం

పాములపాడు, న్యూస్‌టుడే : గ్రామ స్వరాజ్యం తెదేపాతోనే సాధ్యమని ఆ పార్టీ నాయకులు ఆదిరెడ్డి, సర్పంచి మాణిక్యమ్మ పేర్కొన్నారు. పాములపాడు మండలం వేంపెంట గ్రామంలో గాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పాడైన చెత్త తరలించే రిక్షాలకు మరమ్మతులు చేయించి క్లాప్‌మిత్రలకు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

కొత్తపల్లి : సమస్య : పెద్దగుమ్మడాపురంలో కొన్ని వీధి దీపాలు వెలగడం లేదు. **- నారాయణ, స్థానికుడు**

సమాధానం : వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- విజయ్‌కుమార్, సర్పంచి**

సమస్య : ఎర్రమఠం గూడేనికి రోడ్డేయాలి. **- ప్రసాద్**

సమాధానం: సీసీరోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. **- బాలఎల్లయ్య, సర్పంచి**

ఆంజనేయుడికి అమావాస్య పూజలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : పట్టణంలోని ఆత్మలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న అభయాంజనేయ గుడిలో బుధవారం అమావాస్య పూజలు నిర్వహించారు. స్వామి వారిని రంగు రంగుల దారాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి స్వామి వారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సామూహిక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 12 రకాల నక్షత్ర హారతులిచ్చారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఐదు రకాల హారతులిచ్చారు.



ఆత్మకూరులో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

పగిడ్యాల, న్యూస్‌టుడే : మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో ఉన్న లక్ష్మీచెన్నకేశవ ఆంజనేయస్వామి ఆలయాల్లో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అమావాస్య సందర్భంగా ఆంజనేయస్వామికి ఆకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు.



పగిడ్యాల : ఆకుపూజ అలంకరణలో హనుమంతుడు

నిధులు వృథా సమస్యల సంత



అక్కరకు రాని షెడ్లలోని అరుగులు



వానొస్తే ఇదీ దారుల దుస్థితి (పాతచిత్రం)

నంద్యాల పట్టణం గాంధీచౌక్‌లోని కూరగాయల మార్కెట్‌లో సమస్యలు తిష్టవేశాయి. రూ.కోట్లలో నిధులు ఖర్చు చేసినా సరైన కనీస వసతులు కరవయ్యాయి. చిన్నపాటి వర్షం కురిసినా మార్కెట్ మొత్తం చిత్తడిగా మారుతోంది. రోడ్లపై నీరు నిలుస్తోంది. మూడు దశాబ్దాల కిందట నిర్మించిన దుకాణాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో ఎప్పుడే ప్రమాదం ముంచుకొస్తుందోనని వ్యాపారులు భయం భయంగా వ్యాపారం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

☛ నంద్యాల మార్కెట్‌లో వసతుల కొరత

☛ వినియోగదారులు, వ్యాపారులకు అవస్థలు

మార్కెట్‌లోని దుకాణాలు	: 100
రోజూ వచ్చే వినియోగదారులు	: 2 వేల మంది
నిత్యం జరిగే వ్యాపారం	: రూ.30 లక్షలు
రోజూ విక్రయించే కూరగాయలు	: 10 టన్నులు
నిత్యం మార్కెట్‌కు వచ్చే వాహనాలు	: 400

దారులు అధ్వానం.. కాల్వలు శూన్యం

పట్టణ వాసులతో పాటు పలు గ్రామాల నుంచి రోజూ వేలాదిమంది ప్రజలు కూరగాయలు, సరకులు కొనేందుకు గాంధీచౌక్ మార్కెట్‌కు వస్తుంటారు. వినియోగదారులు రాకపోకలు సాగించేందుకు వీలుగా సరైన రహదారులు లేవు. మట్టి దారులు ఉన్నాయి. చిన్నపాటి వర్షం పడినా ఈ దారులు బురదమయం అవుతున్నాయి. కాల్వలు లేకపోవడంతో వర్షంనీరు రోడ్లపైనే నిలుస్తోంది. మార్కెట్‌లో నూతన రహదారులు, కాల్వలు ఏర్పాటు చేయాలని వ్యాపారులు, వినియోగదారులు కొన్నేళ్లుగా కోరుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు.



మార్కెట్ దారుల్లో నిత్యం చిత్తడే

మరుగునపడ్డ సౌకర్యాలు

☛ మార్కెట్‌లో మరుగుదొడ్లు వెనకవైపున ఒక మూలకు ఉన్నాయి. ఇక్కడ మరుగుదొడ్లు ఉన్నాయనే విషయం ప్రజలకు తెలియక వారిని వినియోగించడం లేదు. మరుగుదొడ్లు ఉన్నట్లు సూచికలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

☛ కూరగాయలు కొనేందుకు వచ్చే వారికి కనీసం తాగునీటి వసతి కూడా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తప్పని ట్రాఫిక్ కష్టాలు

గాంధీచౌక్ మార్కెట్‌లో ప్రతి శనివారం సంత జరుగుతుంది. దీంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిమంది ప్రజలు, వ్యాపారులు తరలివస్తారు. చాలామంది ద్విచక్ర వాహనాలపై వస్తున్నారు. వీటితో పాటు దూర ప్రాంతాల నుంచి సరకులు, కూరగాయలు తీసుకొచ్చే వాహనాలు.. సంతలో కొనుగోలు చేసిన సరకును తరలించేందుకు వచ్చే ఆటోలతో ఈ ప్రాంతంలోని రోడ్లు నిండిపోతున్నాయి. మరోవైపు పార్కింగ్ స్థలం లేక ప్రధాన రహదారిపైనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

భయం భయంగా వ్యాపారం

మార్కెట్‌లోని దుకాణాలు 30 ఏళ్ల కిందట నిర్మించినవి కావడంతో పాతబడ్డాయి. కాంక్రీటు పెచ్చులూడి పడుతున్నాయి. గతేడాది ఓ దుకాణం ముందు స్లాబ్ కూలి వ్యాపారి గాయాలయ్యాయి. త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. ఇక్కడ చాలా దుకాణాలు శిథిలావస్థలో ఉండటంతో తమ ప్రాణాలకు రక్షణ కరవైందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నూతన షెడ్లు నిరుపయోగం

గతంలో మార్కెట్‌లో రూ.కోటి వ్యయంతో షెడ్లు, రహదారులు నిర్మించారు. వాటిలో అరుగులు చాలా ఎత్తులో నిర్మించారు. అవి కూడా ఇరుకుగా ఉన్నాయి. దీంతో వ్యాపారులు అక్కడికి వెళ్లడం లేదు. ఫలితంగా ఇవి నిరుపయోగంగా ఉన్నాయి. అరుగుల ఎత్తు తగ్గించి విశాలంగా మార్చి కేటాయిస్తే అక్కడే వ్యాపారాలు సాగిస్తామని వ్యాపారులు చెబుతున్నారు.

రద్దీ మార్గాన.. కరవైన రక్షణ



నంద్యాల పట్టణం నూనెపల్లె నుంచి అయ్యాలూరుకు వెళ్లే దారిలో పంటకాలువ ప్రమాదకరంగా మారింది. దీనిపై ఏర్పాటు చేసిన మోరీకి ఇరువైపులా రక్షణగోడలు కూలిపోవడంతో వాహనదారులు భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోంది. ఈ మార్గంలో 30 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రద్దీగా ఉండే ఈ దారిలో వాహనాలు ఎదురెదురుగా వచ్చిన సందర్భాల్లో రోడ్డు అంచులకు వెళితే కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. అధికారుల స్పందించి కాలువకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

పిలిచి అవమానించారు

నందికొట్కూరు, న్యూస్‌టుడే : గాంధీ జయంతి కార్యక్రమానికి పురపాలక ఛైర్మన్, కౌన్సిలర్లను కమిషనర్ ఆహ్వానించి అవమానించారని ఛైర్మన్ సుధాకరరెడ్డి ఆరోపించారు. స్థానిక ఛైర్మన్ ఛాంబర్‌లో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గాంధీ జయంతి కార్యక్రమానికి ఎమ్మెల్యే వస్తున్నారని కమిషనర్ ఆహ్వానిస్తే వచ్చామన్నారు. పురపాలక కార్యాలయం ఆవరణలో ఛైర్మన్ అధ్యక్షతన కార్యక్రమం జరగాల్సిన ఉన్నా తమను పిలవలేదన్నారు. ఏటా గాంధీ దంపతుల విగ్రహాల దాతలను పిలిపించి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించేవారమన్నారు. ఈసారి వారిని కూడా పిలువకుండా ఏకపక్ష ధోరణిలో కార్యక్రమాన్ని నిర్వహించడంపై కమిషనర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఛైర్మన్ తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కోరారు. స్థానిక మంత్రి కార్యాలయంలో బుధవారం వారు ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ ప్రసాద్, జె.సుధాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం జీవో 117 తీసుకొచ్చి 3, 4, 5 తరగతులను 3 కి.మీల దూరంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల 1, 2 తరగతుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ జీవోను రద్దు చేయాలని కోరారు. నాయకులు సత్యప్రకాశ్, బాబాఫకృద్దీన్, షమీమ్‌బాను, వెంకటేశ్వరరెడ్డి, మహ్మద్‌హుసేన్, సుజాత, కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : అర్హులైన ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించి పురపాలక పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీర్చాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ ప్రసాద్, జె.సుధాకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఎంఈవో కార్యాలయం ముందు బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని యాజమాన్య పాఠశాలల్లో పండిట్, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ అయినా మున్సిపల్ పాఠశాలల్లో మాత్రం కాలేదన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్యప్రకాశ్, బాబాఫకృద్దీన్, షమీమ్‌బాను, సుజాత, రామకృష్ణుడు, అరవింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో యూటీఎఫ్ నాయకులు

సాఫ్ట్‌బాల్ పోటీల గోడపత్రాల ఆవిష్కరణ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాలలో ఈనెల 6 నుంచి నిర్వహించే జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ గోడపత్రాలను రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ.ఫరూక్ ఆవిష్కరించారు. స్థానిక తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్‌తో కలిసి ఆయన గోడపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్యాంసుందర్‌లాల్, శివశంకర్‌యాదవ్, కర్నూలు జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి విజయకుమార్, పీడీ శ్రీధర్, పీఈటీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బీమా సంస్థకు ఏజెంట్లే మూల స్తంభాలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జీవిత బీమా సంస్థకు ఏజెంట్లు మూల స్తంభాల్లాంటి వారని ఎల్ఐసీ ఏజెంట్ల సమాఖ్య అధ్యక్షుడు స్వామిదాసు, శాఖ మేనేజరు పాండురంగ నాయక్ పేర్కొన్నారు. ఆత్మకూరు ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయం ముందు బుధవారం జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డివిజన్‌లో ఆత్మకూరు బ్రాంచి ముందు వరుసలో ఉండటానికి ఏజెంట్లే కారణమని అభినందించారు. కార్యక్రమంలో అధికారులు జగన్నాథరాజు, విజయకుమార్, నాగన్న, నాయకులు రామకృష్ణారెడ్డి, కరీం, లక్ష్మీరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఏజెంట్లు, సిబ్బంది

గిరిజన గూడేల అభివృద్ధికి కృషి

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : సున్నిపెంటలోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు కార్యాలయంలో ప్రధానమంత్రి జన జాతీయ ఉన్నత గ్రామ అభియాన్ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను ఐటీడీఏ పీవో సురేష్‌కుమార్ బుధవారం ఆవిష్కరించారు. శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజన గూడేల అభివృద్ధిపై దృష్టి సారించి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఆరోగ్యం, విద్య, జీవనోపాధి వంటి కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐటీడీఏ సిబ్బంది పాల్గొన్నారు.



నందికొట్కూరు : గాంధీ దంపతుల విగ్రహాలకు ఎమ్మెల్యే జయసూర్య, పాలక వర్గ సభ్యుల నివాళి



నందికొట్కూరు: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..



గడివేముల : మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



నంద్యాల పాతపట్టణం : పీఆర్‌టీయూ కార్యాలయంలో గాంధీజీ, లాల్ బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు నివాళి



వెలుగోడు : గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్డీపీఐ నాయకులు



నంద్యాల పాతపట్టణం : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

మహనీయుల మార్గం.. అనుసరణీయం

☛ ఊరూరా గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి

మహనీయులు నడిచిన మార్గం అనుసరణీయమని వక్తలు పేర్కొన్నారు. మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను బుధవారం ఊరూరా ఘనంగా నిర్వహించారు. మహనీయుల విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి వారు అందించిన సేవలను కొనియాడారు. నీతి, నైతిక విలువలతో కూడిన గాంధీ మార్గాన్ని అనుసరిస్తేనే శాంతి, ప్రగతి సాధ్యమవుతాయని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల క్లస్టరు బృందం



ఆత్మకూరు పట్టణం : గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తెదేపా నాయకులు



సున్నిపెంట సర్కిల్ : గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సురేష్‌కుమార్



నంద్యాల పాతపట్టణం : గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



ఆత్మకూరు పట్టణం : పుర ఛైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, కమిషనర్ నివాళి



నంద్యాల పాతపట్టణం : గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

శిరీష.. విజయాలపైనే ధ్యాస

☛ ఖోఖోలో రాణిస్తున్న వెలుగోడు విద్యార్థిని

వెలుగోడు, న్యూస్‌టుడే : క్రీడలపై ఆసక్తితో ఖోఖో నేర్చుకుని విజయ పథంలో సాగుతోంది వెలుగోడు విద్యార్థిని శిరీష. మెరుగైన శిక్షణ, నిత్య సాధనకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం తోడవ్వడంతో పోటీల్లో రాణిస్తోంది. ఆటపై పట్టు సాధించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ప్రశంసలు అందుకుంటోంది.

☛ మండల కేంద్రం వెలుగోడుకు చెందిన శివరాం, హైమావతి దంపతుల కుమార్తె శిరీష. ప్రస్తుతం స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తుండటంతో ఉపాధ్యాయులు ప్రోత్సహించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు సురేష్‌నాయుడు ఖోఖోలో శిక్షణ ఇచ్చి మెలకువలు నేర్పారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో శిరీష మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించింది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. జాతీయస్థాయిలో ఉత్తమ క్రీడాకారిణిగా గుర్తింపు పొందాలన్నదే తన లక్ష్యమని చెబుతోంది శిరీష.



సాధించిన విజయాలు

☛ 2023 ఆగస్టులో ఆత్మకూరులో జరిగిన నియోజకవర్గ స్థాయిలో పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపింది.

☛ 2023 ఆగస్టులో జిల్లా స్థాయిలో పోటీల్లో పాఠశాల జట్టును విజయతీరాలకు చేర్చడంలో కీలకపాత్ర పోషించింది.

☛ 2023 నవంబరులో గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు తరపున ఆడి అత్యుత్తమ ప్రదర్శన చేసి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది.

☛ ఇటీవల ఝార్ఖండ్‌లో జరిగిన 14వ సబ్ జూనియర్ జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చేసింది.




ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ జోజిరెడ్డి, ప్రిన్సిపల్ మధుసూదన్‌శెట్టి

జేఎన్‌టీయూఏ సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు జేఎన్‌టీయూఏ సాఫ్ట్‌బాల్ జట్టును ఎంపిక చేసినట్లు జేఎన్‌టీయూఏ క్రీడా సంచాలకులు జ్యోజిరెడ్డి తెలిపారు. మండలంలోని శాంతిరాం ఫార్మసీ కళాశాలలో బుధవారం ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో 30 కళాశాలలకు చెందిన 70 మంది విద్యార్థులు పాల్గొనగా, ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేశామన్నారు. ఎంపికైన జట్టు నవంబరులో మధ్యప్రదేశ్ రాష్ట్రం ఉజ్జయినిలోని విక్రమ్ విశ్వవిద్యాలయంలో జరిగే జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. ఎంపికైన జట్టును ప్రిన్సిపల్ మధుసూదన్‌శెట్టి, పీడీ మునిశంకర్ తదితరులు అభినందించారు.

గ్రామాల శుభ్రతకు కృషి చేయాలి

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని ఎంపీడీవో దస్తగిరి పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా పాణ్యంలో బుధవారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం చెత్త సంపద కేంద్రాన్ని ప్రారంభించారు. పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ హుసేన్‌బీ, సర్పంచి పల్లవి, ఉప సర్పంచి చంద్రశేఖర్‌రెడ్డి, ఈవోఆర్డీ సులోచన, పంచాయతీ కార్యదర్శి ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.



చెత్త సంపద కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఇస్తిమాకు రావాలని ఆహ్వానం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరులో జనవరి 8, 9 తేదీల్లో జరిగే ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాల ఇస్తిమాకు హాజరవ్వాలని ఇస్తిమా కమిటీ సభ్యులు, మదరసా కమిటీ ఛైర్మన్ రషీద్ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి బుధవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. సుమారు 2 లక్షల మంది హాజరవుతారని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరులో ఇస్తిమా నిర్వహించనుండటం హర్షణీయమన్నారు.

శ్రీశైల దేవస్థానానికి లారీ బహూకరణ

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల దేవస్థానానికి ఎస్బీఐ తరపున లారీ బహూకరించారు. ఆలయ ముందు భాగంలోని గంగాధర మండపం వద్ద దేవస్థానం ఈవో డి.పెద్దిరాజుకు ఎస్బీఐ ఎండీ రాణాఅసుతోష్‌కుమార్ సింగ్ బుధవారం వాహనానికి సంబంధిత పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్బీఐ శాఖ జీఎం సంజయ్‌కుమార్, డీజీఎం దినేష్ గులాటి, ఆర్.ఎం.సూర్యప్రకాశ్, హెచ్.ఆర్ మేనేజర్ కేశవ, స్థానిక మేనేజర్ టి.భగవాన్, దేవస్థానం ఈఈ ఎం.నరసింహారెడ్డి పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు ప్రభుత్వమే నిర్వహించాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షమీం బేగం, ప్రధాన కార్యదర్శి రజిత డిమాండ్ చేశారు. నంద్యాల పట్టణం గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహం ఎదుట బుధవారం ఏపీ మహిళా సమాఖ్య నాయకురాళ్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీని వెంటనే రద్దు చేయాలని కోరారు. మద్యానికి బానిసలైన వారికోసం డీఅడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకురాళ్లు ముర్తుజాబీ, లక్ష్మీదేవి, షరీన్, మున్ని, మాధవి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మహిళా సమాఖ్య నాయకురాళ్లు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానాచార్యులు షేక్‌షావలి తెలిపారు. కర్నూలులోని స్టేడియంలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రీడల్లో మొదటి సంవత్సరం బైపీసీ విద్యార్థిని సుమతి వాలీబాల్‌లో ప్రతిభ చూపి విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఎంఈటీ మొదటి సంవత్సరం విద్యార్థి నరసింహులు హాకీలో రాణించి కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ సందర్భంగా బుధవారం ప్రధానాచార్యులు, పీడీ రియాజుద్దీన్, సిబ్బంది క్రీడాకారులను అభినందించారు.



క్రీడాకారులతో కళాశాల ప్రధానాచార్యులు, సిబ్బంది

మహానంది దేవస్థానం సిబ్బంది విధుల మార్పు

మహానంది, న్యూస్‌టుడే : మహానంది దేవస్థానంలో పనిచేస్తున్న సిబ్బందిలో 18 మందికి కొత్త విధులను కేటాయిస్తూ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏఈవో వై.మధుకు ఆలయం, కార్యాలయ విభాగం కేటాయించారు. శ్రీశైలం దేవస్థానం నుంచి బదిలీపై వచ్చిన దేవికకు సూపరింటెండెంట్‌గా, సీనియర్ అసిస్టెంట్ పి.సుబ్బారెడ్డికి శానిటేషన్, కోర్టు పనులు, ఆడిట్, జనరల్ విభాగాలు అప్పగించారు. సీనియర్ అసిస్టెంట్ జగదీశ్వరరెడ్డికి డీసీబీ సెక్షన్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులుకు సెకండ్ షిఫ్ట్ ప్రొటోకాల్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఏ-6 సీటును కేటాయించారు. జూనియర్ అసిస్టెంట్ అనురాధకు విరాళాల కౌంటర్, వెంకటలక్ష్మికి ఆలయంలోపల మహిళా విభాగం శానిటేషన్, జూనియర్ అసిస్టెంట్ నాగమల్లయ్యకు బీ-2 సెక్షన్‌లోని పడితరం, డీసీబీ గుమస్తాకు సహాయకులుగా కేటాయించారు. రికార్డు అసిస్టెంట్ సీహెచ్ లక్ష్మయ్య శివాలయం, మరో రికార్డు అసిస్టెంట్ ఎ.రామశివకు 2వ షిప్టు, ఎన్ఎంఆర్ బిందుదేవికి ప్రసాదాల టికెట్ల కౌంటర్ కేటాయించారు.

త్రిసభ్య కమిటీ నియామకం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణంలోని శ్రీనివాస సహకార గృహ నిర్మాణ సంఘానికి ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమించిందని జిల్లా సహకార సంఘం డిప్యూటీ రిజిస్ట్రారు ఎం.వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు. అక్టోబరు 2 నుంచి వచ్చే 2025 ఏప్రిల్ 1 వరకు ఆరు నెలల పాటు త్రిసభ్య కమిటీ ద్వారానే సొసైటీ లావాదేవీలు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. కమిటీ సభ్యులుగా అసిసెంటు రిజిస్ట్రార్లు జె.రాములు, ఎన్.వెంకటసుబ్బయ్య, సీనియర్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖరరెడ్డి సభ్యులుగా ఉంటారని వివరించారు.

చోరీ కేసులో దొంగల అరెస్టు

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని చాపిరేవుల గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఇంట్లో గత శనివారం చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు గ్రామీణ సీఐ అస్రార్‌బాషా తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారన్నారు. నూనెపల్లెకు చెందిన కిరణ్‌బాబు, సాదికనగర్‌కు చెందిన హుసేన్‌బాషాలను బుధవారం అరెస్టు చేసి వెండి ఆభరణాలు, రూ.13 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు వెల్లడించారు.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్


ఆళ్లగడ్డ: రక్తదానం చేసిన సిబ్బంది

సర్వేయర్ల రక్తదాన శిబిరం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ సర్వేయర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆర్డీవో వి.మల్లికార్జునరెడ్డి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 50 మంది రెవెన్యూ సిబ్బంది రక్తదానం చేశారు. మండల సర్వేయర్ రవిప్రసాద్ పాల్గొన్నారు.

అవుకు, న్యూస్‌టుడే: రామాపురంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఫ్రెండ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో 31 మంది యువకులు పాల్గొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు

స్పందనకు వందనం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: బేతంచెర్ల పట్టణంలోని పలు కాలనీల్లో వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టారు. వీధి దీపాలు వెలగని పరిస్థితిపై 'ఈనాడు'లో 'అవస్థల మయం' శీర్షికన సెప్టెంబరు 20న ప్రచురితమైన కథనానికి కమిషనర్ హరిప్రసాద్ స్పందించారు. పాడైన దీపాలను బాగు చేయించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 80008 57436
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లి: 80085 73763

డోన్ పట్టణం: **సమస్య:** బేతంచెర్ల సర్కిల్‌లో ప్రధాన రహదారి పక్కన ఉన్న మురుగు కాల్వలో పూడిక పేరుకుపోయింది. –నారాయణ, కొండపేట.

సమాధానం: పూడిక తొలగింపునకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. –సునీల్ బాబు, ఇన్‌ఛార్జి శానిటరీ అధికారి

సమస్య: శ్రీనివాసనగర్‌కు వెళ్లే మార్గంలో శ్రీనివాస థియేటర్ సమీపంలో ప్రధాన రహదారి పక్కన, ప్రైవేట్ ఆసుపత్రి సమీపంలో రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు ఉన్నాయి. –రామచంద్ర, శ్రీనివాసనగర్.

సమాధానం: సిబ్బందితో పిచ్చిమొక్కలను తొలగిస్తాం. –సునీల్‌బాబు, ఇన్‌ఛార్జి శానిటరీ అధికారి.

కొలిమిగుండ్ల: శాంతినగర్ కాలనీ ప్రధాన రహదారి పాడైంది. జ్వాలాలాపెట్టు నుంచి డాక్టర్ రామసుబ్బారెడ్డి ప్రైవేటు వైద్యశాలవరకు సిమెంటు రోడ్డు నిండా గోతులే దర్శనమిస్తున్నాయి. –సీతారామయ్య.

సమాధానం: సిమెంటు రోడ్డును నిర్మిస్తాం. –వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి.

సమస్య: ప్రభుత్వ వైద్యశాల వెనుక వైపున ఉన్న కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. చీకట్లో మధ్య ఇబ్బందులుపడుతున్నాం. –సురేష్.

సమాధానం: వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపడతాం. –వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి.

కోవెలకుంట్ల గ్రామీణం: సమస్య: కోవెలకుంట్ల పట్టణంలోని ప్రధాన రహదారులపై గుంపులుగా ఆవులు సంచరించి రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నాయి. –శ్రీకాంత్

సమాధానం: తగిన చర్యలు తీసుకుంటాం. –జీసీఆర్ సూర్యనారాయణ రెడ్డి, ఉప సర్పంచి.

శిరివెళ్ల: **సమస్య:** మోత్కులపల్లె బీటీ రహదారిపై ముళ్లపొదలు అలుముకున్నాయి. –యేసునాథం

సమాధానం: ముళ్లపొదల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. –వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచి.

అవీ.. ఇవీ.. అన్నీ..

సంజామల, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధికి పంచాయతీ కార్యాలయాల్లో బుధవారం గ్రామ నాయకుల సమక్షంలో అధికారులు ప్రణాళికలు రచించారు. వసంతాపురంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఈసీ నాగలక్ష్మమ్మ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, నాగరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దరాజుపాలెం(బనగానపల్లి గ్రామీణం): పెద్దరాజుపాలెంలోని మద్దిలేటికి చెందిన పొలంలో తాటిచెట్టుపై బుధవారం పిడుగుపడింది. ఎవరూ లేకపోవడంతో ప్రమాదమేమీ జరగలేదు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని ఎస్సై చిన్న పీరయ్య యాదవ్ పేర్కొన్నారు. వైఎస్సార్ జిల్లా-కర్నూలు 40వ జాతీయ రహదారిలోని యర్రగుంట్ల వద్ద ఎస్సై బుధవారం వాహనాల తనిఖీ చేపట్టి మాట్లాడారు.

యర్రగుంట్ల(శిరివెళ్ల), న్యూస్‌టుడే: కౌలురైతులు గుర్తింపుకార్డు కలిగి ఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారి సుధాకర్ బుధవారం పేర్కొన్నారు. యర్రగుంట్లలోని రైతుసేవా కేంద్రంలో కౌలురైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

పాతపాడు(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: మండల పరిధిలోని పాతపాడు గ్రామసర్పంచి మహేశ్వరరెడ్డి జిల్లా ఉత్తమ సర్పంచిగా బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని మంత్రి ఫరూఖ్, కలెక్టరు రాజకుమారి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని పంచాయతీ అధికారులు, ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు.

రుద్రవరం, న్యూస్‌టుడే: రుద్రవరం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు స్వచ్ఛతాహీ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. బుధవారం మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజాకుమారి జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

పేరాయిపల్లె(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: పేరాయిపల్లెలో రామలింగేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లోని శిలాఫలకాలను దుండగులు ధ్వంసం చేశారు. గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన రెండు శిలాఫలకాలను ధ్వంసం చేశారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఎస్సై హరిప్రసాద్ తెలిపారు.

పుస్తకాల కొరత..తీరని కలత

✦ సమస్యలకు నిలయాలుగా గ్రంథాలయాలు
✦ సదుపాయాలు సమకూర్చాలని పాఠకుల వేడుకోలు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: డోన్ పట్టణంలోని గుత్తి రోడ్డులో ప్రధాన రహదారి పక్కన అద్దె భవనంలో ఇరుకైన గదుల్లో గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. రోజూ 60 మంది వరకు గ్రంథాలయానికి పాఠకులు వస్తుండగా, వారానికి, నెలకు పుస్తకాలు తీసుకెళ్లే వారు 150 మంది వరకు ఉన్నారని గ్రంథాలయ శాఖ అధికారిణి రాధాబాయి పేర్కొన్నారు. ప్రస్తుతం రైల్వే శాఖలో పలు ఉద్యోగాలు, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు సాధన చేసే యువత గ్రంథాలయాలను ఆశ్రయిస్తుండగా అవసరమైన పుస్తకాల కొరత ఉందని వారంతా చెబుతున్నారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడేందుకు అవసరమైన పుస్తకాలు రెండు, మూడేళ్ల నుంచి కొత్తవి ఏవీ లేవు. తాగేందుకు నీరు లేక రోజూ రూ.20లు ఖర్చు పెట్టి క్యాన్ తెప్పిస్తున్నారు. గదులు ఇరుకుగా ఉన్నాయి. ర్యాక్‌ల్లో పుస్తకాలు పెట్టేందుకు సరైన స్థలం లేదు. పాఠకుల సంఖ్యకు తగ్గట్టు మరుగుదొడ్లు, ఫర్నీచరు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.


డోన్‌లో ఏళ్ల పాటు అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయ శాఖ కార్యాలయం

రూ.13 లక్షలతో నిర్మాణం

ఆర్‌ఎస్ రంగాపురం(బేతంచెర్ల), న్యూస్‌టుడే: ఆర్‌ఎస్ రంగాపురంలోని గ్రంథాలయం శిథిలావస్థకు చేరింది. పాఠకులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని జిల్లా గ్రంథాలయ శాఖ అధికారులు కొత్త భవన నిర్మాణానికి రూ.13 లక్షలు మంజూరు చేశారు. పోటీ పరీక్షలకు అవసరమైన కొత్త పుస్తకాల సమస్య వేధిస్తోంది. ఫర్నీచర్ లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త పుస్తకాలు, ఫర్నీచర్ కావాలని అధికారులకు తెలియజేసినట్లు గ్రంథాలయ అధికారి శివయ్య తెలిపారు.


గ్రంథాలయ నిర్మాణ పనులు చేస్తున్న కూలీలు

అద్దె భవనంలో నిర్వహణ

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: ఉయ్యాలవాడలో తెలుగు విజ్ఞాన సమాచార కేంద్రం అద్దె భవనంలో నడుస్తోంది. నిరుద్యోగులకు అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలు లేక ఇబ్బందులుపడుతున్నారు. అయిదు సంవత్సరాల నుంచి ప్రభుత్వం కొత్త పుస్తకాలు సరఫరా చేయలేదని నిరుద్యోగులు వాపోతున్నారు.

అసౌకర్యాల చెంతనే!

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: గ్రంథాలయానికి సొంతభవనం ఉన్నా కష్టాలు వీడటం లేదు. రోజూ 80 మంది వరకు పాఠకులు వస్తుంటారు. గ్రంథాలయానికి అవసరమైన ఫర్నీచరు సదుపాయం లేక పాఠకులు ఇబ్బందులుపడుతున్నారు. ఇక్కడ అంతర్జాలంలో పుస్తకాలు చదివేందుకు మూడు కంప్యూటర్లు ఉండగా ఇవి అయిదేళ్లగా నిరుపయోగంగా ఉన్నాయి. నెట్ బిల్లులు ఎక్కువగా వస్తుండటంతో మూలన పెట్టేశారు. తాగునీటి కోసం శుద్ధ జల యంత్రాన్ని అమర్చగా మూడేళ్లుగా ఇది పనిచేయడం లేదు. బయట నుంచి మంచి నీటిని తెప్పించి వినియోగిస్తున్నారు.


పనిచేయని శుద్ధజల యంత్రం

గాంధీజీ ఆశయ సాధనకు కృషి


ఆళ్లగడ్డ: గాంధీ, శాస్త్రికి నివాళులు


ఇంజేడులో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు



చాగలమర్రి: గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఆర్యవైశ్య నాయకులు


బనగానపల్లిలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు కొనియాడారు. బుధవారం గాంధీ, శాస్త్రిల జయంతులను పురస్కరించుకుని వాడవాడలా ఘనంగా ఆ మహనీయుల సేవల్ని కొనియాడారు. దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకురావడంలో అవిరళంగా కృషిచేశారన్నారు. –న్యూస్‌టుడే బృందం


కోవెలకుంట్ల అమ్మవారిశాల దగ్గర వేడుకలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు


డోన్ పట్టణం: జాతిపిత మహాత్మాగాంధీకి నివాళులు అర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు


డోన్: గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు


బేతంచెర్ల: గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సర్పంచి, తెదేపా నాయకులు

నూతన మద్యం విధానాలపై అవగాహన

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: డోన్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయాన్ని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాముడు బుధవారం తనిఖీ నిర్వహించారు. నూతన మద్యం విధానంపై ఇన్‌స్పెక్టర్ వరలక్ష్మీ, ఎస్సై సోమశేఖర్ రావు, సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. డోన్ నియోజకవర్గానికి 16 మద్యం దుకాణాలు డోన్ పట్టణంలో 4, రూరల్‌కు 2, ప్యాపిలికి 3, బేతంచెర్ల పట్టణంలో 4, రూరల్‌కు 3 మంజూరయ్యాయని తెలిపారు. మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియకు గానూ ఈనెల 9 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 11న నూనెపల్లి, నంద్యాలలో ఎంపిక ఉంటుందన్నారు.


విధి విధానాలు సూచిస్తున్న రాముడు


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

బనగానపల్లి, న్యూస్‌టుడే: ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఎల్లా సుబ్బయ్య, మహమ్మద్ రఫీ, హరినాథ్‌గౌడ్‌లను బుధవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.మాధవస్వామి మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయులకు మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. మధుసూదన్‌రావు, వి.సుబ్బరాయుడు, ఎస్.పోలియో నాయక్, కె.రమేష్, కుమార్‌బాబు, రామస్వామి, శేఖర్ పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

డోన్, న్యూస్‌టుడే: క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నెహ్రూనగర్‌లో క్రైస్తవ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఎల్ఐసీ మాజీ ఏవో శీలంజేసుదాసు ఈ గ్రంథాలయన్ని ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. విజ్ఞానం పెంపొందేందుకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఐకాస అధ్యక్షుడు ఆదాం, ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, కార్యదర్శి జాన్సన్‌బాబు, కోశాధికారి జర్మియా, యాదగిరి, జానాప్రభాకర్, పవన్‌కుమార్, ప్రేమ్‌కుమార్, ప్రశాంత్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: వైఎస్సార్ జిల్లా రాజంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1న జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో డోన్ శ్రీసుధ జూనియర్ కళాశాలకు చెందిన ఇ.రేవతి (బైపీసీ, ద్వితీయ) ప్రతిభ చాటడంతో జాతీయ పోటీలకు ఎంపికైందని కరాటే మాస్టర్ అఫ్రోజ్ తెలిపారు. ప్రవల్లిక, వర్షిత, కీర్తన రాణించారని ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

మహిళపై దాడి..కేసు నమోదు

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: బెలుంలో మహిళపై దాడి చేసిన సంఘటన బుధవారం జరిగినట్లు ఏఎస్సై గోవింద నాయక్ చెప్పారు. గ్రామానికి చెందిన నాగలక్ష్మి ఇంటి సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో గోడరాళ్లు వదిలినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి తన స్థలంలో ఎందుకు రాళ్లు ఉంచారని గొడవ పడి ఇనుపరాడ్డుతో నాగలక్ష్మిని కొట్టాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వెంకటేశ్వర్రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణం నుంచి ఆళ్లగడ్డ వైపు వెళ్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రమేష్‌రెడ్డి బుధవారం తెలిపారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు వైపు నుంచి చాగలమర్రి మీదుగా ఆళ్లగడ్డ వైపు ఎలాంటి అనుమతులు లేకుండా వస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను గుర్తించి స్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

అదృశ్యంపై కేసు

దొర్నిపాడు, న్యూస్‌టుడే: దొర్నిపాడు గ్రామానికి చెందిన మహిళ (38) మూడు రోజుల నుంచి అదృశ్యమైనట్లు ఏఎస్సై ప్రతాప్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆసుపత్రికి మందులు తీసుకుని వచ్చేందుకు కర్నూలుకు వెళ్లి తిరిగి రాకపోవటంతో కుటుంబ సభ్యులు, ఇతర ప్రాంతాల్లో వెతికారని, ఆచూకీ తెలియకపోవడంతో తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆదమరిస్తే ప్రమాదమే

ఆర్.పాంపల్లె నుంచి హరివరానికి వెళ్లే రోడ్డు మార్గం వర్షపు నీటి ఉద్ధృతికి పాడైంది. రోడ్డు చివరి అంచులు కోతకు గురి కావడంతో తాత్కాలికంగా వేసిన సిమెంటు పైపు పట్టుతప్పింది. రోడ్డుపై వెళ్లే వాహన చోదకులు ప్రమాదం జరిగే అవకాశం ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. రోడ్డుపై ఉన్న పైపును తొలగించి కల్వర్టును ఏర్పాటు చేయాలని గ్రామస్థులు బుధవారం అధికారులను కోరారు. –న్యూస్‌టుడే, ఉయ్యాలవాడ



సీట్లు...ప్రయాణికులకు ఇక్కట్లు

ఆర్టీసీ పల్లెవెలుగు బస్సుల్లో సీట్లు సక్రమంగా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులుపడుతున్నారు. ప్రయాణికులు పడిపోతున్న సీటును పైకిలేపి కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. గ్యారేజీ సిబ్బంది ఇటువంటి వాటిని గుర్తించి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, డోన్‌పట్టణం



నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలి

డోన్, న్యూస్‌టుడే: దేవీనవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించేందుకు సహకరించాలని వేద గాయత్రి బ్రాహ్మణ సంఘం నాయకులు కళ్లెశేషావలి శర్మ అన్నారు. బుధవారం డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషలకు దేవినరాత్రి ఉత్సవాల ఆహ్వానపత్రికలు అందజేశారు. నేటి నుంచి 12 వరకు స్థానిక గాయత్రి పీఠంలో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తుల పూజలందుకుంటారన్నారు.


డీఎస్పీ శ్రీనివాసులుకు ఆహ్వానపత్రికలను అందిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి అమ్మవారిశాలలో ఈ నెల 3 నుంచి జరగనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని మాజీ సర్పంచి బీసీ రాజారెడ్డిని ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆహ్వానం పలికారు. నాయకులు శ్రీరామ సుబ్రమణ్యం, టంగుటూరి శీనయ్య ఆధ్వర్యంలో బీసీ రాజారెడ్డిని కలిసి ఆహ్వానపత్రిక ఇచ్చారు. ఉత్సవాలను సంతోషంగా జరుపుకోవాలని రాజారెడ్డి కోరారు. బలరామయ్య, రామకృష్ణ, జంగంశెట్టి పాల్గొన్నారు.


బీసీ రాజారెడ్డికి ఆహ్వానం పలుకుతున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లిలో దసరా సందర్భంగా ఈ నెల 7న టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆబేద్, ఇర్ఫాన్ బుధవారం తెలిపారు. పూర్తి వివరాలకు 7013094639 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవాలన్నారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: శరన్నవరాత్రుల కోసం అమ్మవారిశాల ముస్తాబైంది. విద్యుత్తు దీపాలతో అమ్మవారిశాలను, ప్రవేశ మార్గాన్ని అలంకరించారు. రెండు చోట్ల భారీ ప్రవేశ తోరణాలను ఏర్పాటు చేశారు. శరన్నవరాత్రుల ఉత్సవాలకోసం అంతా సిద్ధం చేశామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవిశెట్టి హరీష్ అన్నారు.


విద్యుత్తు దీపాలతో అమ్మవారిశాల ప్రవేశ మార్గం

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కన్యకపరమేశ్వరి ఆలయంలో నేటి నుంచి ఈ నెల 13 వరకు శరన్నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. 6న భగవత్ గీత పారాయణం పోటీలు, 7న భరతనాట్యం తదితర కార్యక్రమాలు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: వాసవి కన్యకపరమేశ్వరి అమ్మవారి దసరా మహోత్సవాలకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ఆర్యవైశ్య నాయకులు బుధవారం ఆహ్వానపత్రిక అందజేశారు.

పరిసరాలు శుభ్రం చేయాలి: కమిషనర్



డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: శ్మశానవాటికకు వెళ్లే దారిని శుభ్రపర్చాలని సిబ్బందికి కమిషనర్ ప్రసాద్‌గౌడ్ ఆదేశించారు. బుధవారం పట్టణ సమీపంలోని శ్మశానవాటిక, కంపోస్టుయార్డు, రహదారులను ఆయన పరిశీలించి మాట్లాడారు. తాత్కాలిక శానిటరీ అధికారి సునీల్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు.. సమాజ సేవకులు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికులు సమాజ సేవకులని ఆళ్లగడ్డ సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డా.రాధికా జ్యోతి అన్నారు. 'స్వచ్ఛతాహి సేవ' కార్యక్రమంలో భాగంగా బుధవారం సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించే పారిశుద్ధ్య కార్మికులను ఆమె సన్మానించారు. డా.రాజ్యలక్ష్మి, డా.అరుణ, ఏపీ ఎన్జీవో సంఘం సహాధ్యక్షుడు వి.దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.


పారిశుద్ధ్య కార్మికుల సన్మానంలో వైద్యులు

ప్యాపిలి, న్యూస్‌టుడే: గాంధీ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈవోఆర్డీ బాలకృష్ణ, ఈవో శివకుమార్ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం, శిశుమందిరం పాఠశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధికారులు, నాయకులు, ఉపాధ్యాయులు నిర్వహించిన సమావేశంలో ఈవోఆర్డీ మాట్లాడారు.

కొచ్చెర్వు(డోన్), న్యూస్‌టుడే: గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని తెదేపా నాయకులు రామాంజనేయులు, సాంబశివుడు తదితరులు పేర్కొన్నారు. స్వచ్ఛతాహీ సేవాలో భాగంగా వారు మాట్లాడారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ఏపీ ఆదర్శపాఠశాల స్వచ్ఛతాహి సేవా జిల్లా స్థాయి పురస్కారానికి ఎంపికైందని ప్రిన్సిపల్ మరియాదాసు తెలిపారు.

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: కార్మికులు బాధ్యతాయుతంగా సేవలు అందించినప్పుడే గుర్తింపు లభిస్తుందని కమిషనర్ ప్రసాద్ గౌడ్ పేర్కొన్నారు. 'స్వచ్ఛతాహి సేవ'లో భాగంగా బుధవారం పాత బస్టాండులోని గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు.

ఆర్‌ఎస్ రంగాపురం(బేతంచెర్ల), న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని మద్దిలేటి స్వామి ఆలయ ఈవో, ఉప కమిషనర్ రామాంజనేయులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆలయంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా గత నెల 17 నుంచి ఆలయ పరిసర ప్రాంతాలను శుభ్రం చేసినట్లు తెలిపారు. అనంతరం గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.


ఆలయం ముందు శుభ్రం చేస్తున్న అర్చకులు

ఘనంగా కేఈ జన్మదిన వేడుకలు

డోన్, న్యూస్‌టుడే: మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి పుట్టినరోజు వేడుకలను స్థానిక తెదేపా కార్యాలయం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెదేపా రాష్ట్రకార్యదర్శి వలసలరామకృష్ణ, నాయకులు ఓబులాపురంశేషిరెడ్డి, సలీంద్రశ్రీనివాసులు తదితరులు కేకు కోసి ఒకరి కొకరు తినిపించుకున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పనిచేయడంతో పాటు డోన్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికై నియోజకవర్గ అభివృద్ధికి గతంలో కృషిచేశారన్నారు. మాజీ సర్పంచి పెద్దకేశవయ్యగౌడ్, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడ్, విజయభట్టు, నారాయణగౌడ్, గంధం శ్రీను, మిద్దెపల్లెగోవిందు, అశోక్, పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.


కేక్ కోసి తినిపించుకుంటున్న నాయకులు

పల్లె ప్రగతికి అడుగులు

మండలం	పనులు	నిధుల కేటాయింపు (రూ.కోట్లలో)
బేతంచెర్ల	23	రూ.2.75
డోన్	19	రూ.2.70
ప్యాపిలి	22	రూ.2 కోట్లు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: వైకాపా ఐదేళ్ల పాలనలో పల్లెల ప్రగతిని పక్కనపెట్టేసింది. పంచాయతీలకు రావాల్సిన నిధులను పక్కదారి పట్టించింది. పంచాయతీలను వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. వీధి దీపాలు, సీసీరోడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర వాటికి నిధులు ఇవ్వకపోవడంతో సర్పంచులు సొంత డబ్బులు పెట్టి అప్పులపాలైన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం, డిప్యూటీ సీఎంల ఆదేశాలతో గ్రామసభలు నిర్వహించి గ్రామీణ ప్రాంత అభివృద్ధికి నివేదికలను తయారు చేసింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మూడు నెలల్లోనే గ్రామీణ అభివృద్ధికి అడుగులు వేసింది. పల్లె ప్రగతి కోసం సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితరాల వాటిపై దృష్టి సారించింది. మురుగు సమస్య పరిష్కారానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నియోజకవర్గంలోని బేతంచెర్ల, డోన్, ప్యాపిలి మండలాలకు సంబంధించి రూ.7.45 కోట్లు మంజూరు చేసింది. ఆయా మండలాల్లోని వివిధ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి 64 పనులను గుర్తించారు.

☛ మండలంలోని రుద్రవరం, బుక్కాపురం, అంబాపురం, రంగాపురం, కొత్తపల్లె, తవిశికొండ, గూటుపల్లె, పెండేకల్లు, గొరుమానుకొండ, శంకలాపురం తదితర గ్రామాల్లో రహదారులు శిథిలమయ్యాయి. ఎక్కడ పడితే అక్కడ గుంతలు పడటంతో అవి కనిపించక ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగి ప్రమాదకరంగా ఉన్నాయి.


మురుగులో నడుస్తున్న మహిళలు

గ్రామాల అభివృద్ధికి చొరవ –వెంగన్న..ఎంపీడీవో, బేతంచెర్ల

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. పనులను గుర్తించారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలకు వెలుగు

–శ్రీనివాసులు యాదవ్, ఉమ్మడి జిల్లాల సర్పంచుల సంఘం అధ్యక్షుడు



అయిదేళ్ల వైకాపా పాలనలో గ్రామ పంచాయతీలకు నిధులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు గ్రామాల అభివృద్ధికి పెద్ద పీట వేశారు. కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అడుగులు పడనున్నాయి.

అప్పులు చేయాల్సి వచ్చింది

–నాగరాజు, బుక్కాపురం సర్పంచి



ఐదేళ్ల వైకాపా పాలనలో పంచాయతీలకు రావాల్సిన నిధులు పక్కదారి పట్టించారు. వేల కోట్లు పంచాయతీల నిధులను నొక్కేశారు. అడిగితే అక్రమ కేసులు బనాయించారు. నిధులు లేక అవస్థలు పడ్డాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి అభివృద్ధి నివేదికలను తయారు చేసి నిధులు మంజూరు చేసింది.